# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 08-04-2025** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1.** **పీఎం ముద్ర యోజన వ్యవస్థాపక నైపుణ్యాలను ప్రదర్శించేందుకు అవకాశాలను కల్పించిందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు.**

2. **విజయవాడ ప్రాంతీయ పాస్ పోర్టు నూతన కార్యాలయాన్ని కేంద్ర విదేశాంగ శాఖ సహాయ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ ఈరోజు ప్రారంభించారు.**

3. **గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయం, పర్యాటక ప్రోత్సాహకాలు కల్పించనున్నామని ఉప ముఖ్యమంత్రి కె పవన్ కళ్యాణ్ తెలిపారు.**

**4.** **హంద్రీనీవా ప్రాజెక్టు విస్తరణ పనులను జూన్ నాటికి పూర్తి చేస్తామని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు స్పష్టం చేశారు.**

**5.** **దేశ వ్యాప్తంగా ఈరోజు నుంచి 7 వ విడత పోషణ పక్షోత్సవాలను నిర్వహిస్తున్నారు.**

==========================

దేశంలో చిరు వ్యాపారులను ప్రోత్సహించే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి ముద్ర యోజన ఈరోజుతో పది సంవత్సరాలు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా ఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ లబ్దిదారులతో సమావేశమయ్యారు. వారితో మాట్లాడుతూ.. ముద్రా యోజన అనేకమందికి వ్యవస్థాపక నైపుణ్యాలను ప్రదర్శించేందుకు అవకాశాలను కల్పించిందని అన్నారు.

మరోవైపు... ప్రధానమంత్రి ముద్ర యోజన అనంతపురం జిల్లాలో విజయవంతంగా అమలవుతోంది. జిల్లాలోని గుంతకల్లు పట్టణానికి చెందిన లబ్దిదారుడు ఈ పథకం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ,

..వాయిస్..20 సెకన్లు

---------------------------

రాజధాని అమరావతిలో విదేశాంగ శాఖ ప్రాంతీయ పాస్ట్‌పోర్ట్ కార్యాలయం ఏర్పాటు చేయనున్నామని కేంద్ర విదేశాంగ శాఖ సహాయమంత్రి కీర్తివర్ధన్ సింగ్ తెలిపారు. విజయవాడలో ఆధునీకరించిన నూతన ప్రాంతీయ పాస్‌పోర్ట్ కార్యాలయాన్ని ఆయన ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ, పాస్ పోర్ట్ సేవలను మరింత సరళతరం చేశామని చెప్పారు. ఈ- పాస్ట్‌పోర్ట్‌ను అందుబాటులోకి తెస్తున్నామని ఆయన తెలియజేస్తూ...

..వాయిస్...31 సెకన్లు

---------------------------

అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఉప ముఖ్యమంత్రి కె పవన్ కళ్యాణ్ పర్యటన రెండవ రోజు కొనసాగుతోంది. ఈ రోజు అరకులోని కురుడి గ్రామంలో కొలువైన శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామిని ఆయన దర్శించుకున్నారు. అనంతరం రచ్చబండ కార్యక్రమంలో పాల్గొని ప్రజలు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కురిడి గ్రామ అభివృద్ధి నిమిత్తం 5 లక్షల రూపాయలు మంజూరు చేస్తున్నట్లు ఉపముఖ్యమంత్రి ప్రకటించారు. అలాగే పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ, పర్యాటకశాఖ సంయుక్త కార్యాచరణలో గ్రామంలో ప్రకృతి వ్యవసాయం, పర్యాటక ప్రోత్సాహకాలు కల్పించడం ద్వారా ఉపాధి కల్పిస్తామని పవన్‌కళ్యాణ్ హామీ ఇచ్చారు.

---------------------------

యోగ సాధన ద్వారా విద్యార్థులలో పఠనా శక్తితో పాటు శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగు పడుతుందని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయలోని డిగ్రీ కళాశాల మైదానంలో గిరిజన విద్యార్థులతో నిన్న నిర్వహించిన 'మహా సూర్య వందనం' కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, విద్యార్థుల ఆరోగ్యాన్ని పెంపొందించేలా ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమని అన్నారు. గిరిజన విద్యార్థులు చదువుతోపాటు క్రీడలు, ఇతర అంశాల్లోనూ రాణిస్తున్నారని మంత్రి తెలియజేస్తూ,

వాయిస్ ... 22 సెకన్లు

---------------------------

హంద్రీనీవా ప్రాజెక్టు విస్తరణ పనులను జూన్ నాటికి పూర్తి చేస్తామని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. కర్నూలు జిల్లా పర్యటనలో భాగంగా ఈరోజు ఆయన హంద్రీనీవా ప్రాజెక్టును పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఈ ప్రాజెక్టుకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందని తెలిపారు. బడ్జెట్‌లో 3 వేల 243 కోట్ల రూపాయలను కేటాయించడం జరిగిందని చెప్పారు. ప్రాజెక్టును పూర్తిస్థాయిలో వినియోగంలోకి తెచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి వివరించారు.

---------------------------

రాష్ట్ర గీతమైన మా తెలుగుతల్లికి మల్లెపూదండ గీతాన్ని రచించిన శంకరంబాడి సుందరాచారి వర్ధంతి ఈరోజు. 1914 ఆగస్ట్ 10వ తేదీన ఆయన తిరుపతిలో జన్మించారు. మా తెలుగుతల్లికి మల్లెపూదండ గీతంలో రాష్ట్ర చారిత్రక, సాంస్కృతిక వారసత్వాన్ని నాలుగు పద్యాలలో శంకరంబాడి సుందరాచారి రచించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ గీతాన్ని రాష్ట్ర గీతంగా గుర్తించి గౌరవించింది. 1977 ఏప్రిల్ 8వ తేదీన సుందరాచారి తిరుపతిలో కన్నుమూశారు. 2004లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, తిరుపతి–తిరుచానూరు రోడ్డులోని ఆయన జ్ఞాపకార్థం, కాంస్య విగ్రహాన్ని నెలకొల్పి గౌరవించింది. ప్రఖ్యాత గాయకురాలు టంగుటూరి సూర్యకుమారి గ్రామఫోన్ రికార్డు కోసం పాడిన ఆ గీతం ఇప్పుడు విందాం .

వాయిస్.. 17 సెకన్లు

---------------------------

దేశ వ్యాప్తంగా చిన్నారులు, స్త్రీల ఆరోగ్య పరిరక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం పోషక ఆహారాన్ని అందించే లక్ష్యంతో "జాతీయ పోషకాహార మిషన్ "ను అమలు చేస్తోంది. ఇందులో భాగంగా 7 వ విడత పోషణ పక్షోత్సవాలను ఈ రోజు నుండి ఈ నెల 22 వ తేదీ వరకు నిర్వహిస్తోంది. పోషన్ పఖ్వాడా చిన్నారుల జీవితంలో పోషక అభివృద్ధికి కీలకమైన మొదటి 1,000 రోజులపై దృష్టి పెడుతుంది. అలాగే తీవ్రమైన పోషకాహార లోపం ఉన్న వారిని ముందస్తుగా గుర్తించి తగిన సంపూర్ణ పోషణ అందించేలా కార్యక్రమాలను నిర్వహిస్తోంది. అలాగే ఈ కార్యక్రమం పోషకాహార ప్రాధాన్యాన్ని తెలియజేయడంతో పాటు బాల్య ఊబకాయంపై దృష్టి సారిస్తుంది.

---------------------------

రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులపై కక్షపూరితంగా వ్యవహరిస్తోందని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆరోపించారు. శ్రీసత్యసాయి జిల్లా రాప్తాడులోని పాపిరెడ్డి పల్లిలో హత్యకు గురైన ఆ పార్టీ కార్యకర్త లింగమయ కుటుంబాన్ని ఆయన ఈరోజు పరామర్శించారు. అనంతరం జగన్మోహన్ రెడ్డి మాట్లాడుతూ... తమ పార్టీ నాయకులు, కార్యకర్తలపై హింసకు పాల్పడే వారిని గుర్తించి ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

---------------------------

ఉపాధిహామీ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలను కల్పించేందుకు కృషి చేస్తున్నామని సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. విజయనగరం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా నీటి యాజమాన్య సంస్థ ద్వారా అమలవుతున్న కార్యక్రమాలపై మంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఈ పథకం గ్రామీణ స్థానికులకు పని కల్పించడంతో పాటు, ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనకు, జీవన ప్రమాణాలను పెంచేందుకు దోహదపడుతోందని అన్నారు.

---------------------------

పెట్టుబడులను పెట్టేందుకు ఆంధ్రప్రదేశ్ అనువైన రాష్ట్రమని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. పల్నాడు జిల్లా చిలకలూరి పేట మండలం, మురికిపూడిలో ప్రైవేటు గ్రానైట్ ఫ్యాక్టరీని మంత్రి నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకాశం జిల్లా నుంచి ఎగుమతి చేసే గ్రానైట్ ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి పొందిందని చెప్పారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చిన వారికి రాష్ట్ర ప్రభుత్వం రాయితీలను ఇచ్చి ప్రోత్సహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ తీసుకుంటున్న చర్యల కారణంగానే దేశంలో వృద్ధిరేటు మెరుగ్గా ఉన్న రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ రెండో స్థానంలోకి నిలిచిందని మంత్రి పేర్కొన్నారు.

---------------------------

బ్యాచిలర్ ఆఫ్ ఎడ్యుకేషన్ బీఈడీ, ప్రత్యేక బీఈడీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే ఉమ్మడి విద్య ప్రవేశ పరీక్ష-ఎడ్‌సెట్ నోటిఫికేషన్‌ను ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం జారీచేసింది. అభ్యర్థులు వచ్చేనెల 14వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించాలని సెట్ కన్వీనర్ ఆచార్య ఏవివి స్వామి తెలిపారు. ఓసి అభ్యర్థులు 650, బీసీలు అభ్యర్థులు 500, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు 450 రూపాయలు చొప్పున పరీక్ష రుసుము చెల్లించాలని సూచించారు. కాగా జూన్ 5వ తేదీన పరీక్ష జరగనుంది.

=====================